క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు శ్రీకాళహస్తి క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

శ్రీకాళహస్తి: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు పట్టణానికి చెందిన కేసీసీ అకాడమి క్రీడాకారులు ఎంపికయ్యారు. కృష్ణాజిల్లా మచిలీపట్టణంలోని నేషనల్ కళాశాలలో ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు క్రికెట్ పోటీలు జరిగాయి. అండర్ 14 విభాగంలో కేసీసీ జట్టు మూడో స్థానంలో నిలవగా, అండర్ 17 విభాగంలో ప్రీక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. అండర్-14 విభాగంలో విఖ్యాత్, కేతన్, హిమచరణ్, మోనిష్, అండర్ 17 విభాగంలో మోనిష్, కార్తీక్, గణేష్, రోహిత్, జయశివ ఎంపికయ్యారు. ఎంపికై న వారిని నిర్వాహకులు అభినందించారు.

శభాష్ వలంటీర్



లక్ష్మమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ మోహిని

ఏర్పేడు: అనారోగ్యం కారణంగా వడమాలపేట మండలం, గాజులమండ్యంలోని కుమార్తె వద్ద ఉంటున్న వృద్ధురాలికి వలంటీర్ గురువారం ఆ గ్రామానికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసి, శభాష్ అనిపించుకున్నారు. మండలంలోని పెద్దఅంజిమేడు గ్రామానికి చెందిన బొడుగు లక్ష్మమ్మకు వృద్ధాప్య పింఛన్ వస్తుంది. ఈమె అనారోగ్యం పాలవడంతో నాలుగు రోజుల క్రితం గాజులమండ్యంలోని తమ కుమార్తె వద్దకు వెళ్లింది. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె కాలుకు గాయాలయ్యాయి. కదలలేని పరిస్థితిలో కుమార్తె వద్ద ఉండడంతో వలంటీర్ మోహిని అక్కడకు వెళ్లి, వేలిముద్రలు సేకరించి పింఛన్ నగదును అందజేసింది.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న గౌడసంఘం నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన మలిశెట్టి బాలాజీగౌడ్ కుటుంబానికి శ్రీకాళహస్తి గౌడ సంక్షేమ సంఘం నాయకులు గురువారం రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. మలిశెట్టి బాలాజీగౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. అతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలున్నారు. అయితే వారికి సొంత ఇల్లు కూడా లేదు. ఈ నేపథ్యంలో గౌడ సంఘం నేతలు స్పందించి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మోహన్‌గౌడ్, అత్తిరాల శ్రీరాములుగౌడ్, తిరుకాల పురుషోత్తంగౌడ్, దాసరి ధనంజయులుగౌడ్, దాసరితేజా గౌడ్, జడపల్లి గోపాలకృష్ణగౌడ్, అరగొండ భాస్కర్‌గౌడ్, అత్తిరాల భాస్కర్‌గౌడ్, చిట్టిం రవిగౌడ్, అప్పారాల గణేష్‌గౌడ్, అయ్యప్పగౌడ్, హరికృష్ణగౌడ్, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం గ్రామ పంచాయతీ గిరిజనకాలనీలో వీధి లైట్లు పగలు కూడా వెలుగుతున్నాయి. లైట్లను ఆర్పడానికి అధికారులు స్విచ్‌లు ఏర్పాటు చేయలేదు. ఈ విషయాన్ని తెలిపినా విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న గోపాల్ రెడ్డి

ఏర్పేడు: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని సమగ్ర శిక్ష ఏఎస్‌ఓ గోపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఏర్పేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయుడు సుబోస్ పాల్గొన్నారు.

పేర్నాటికి భారీ మెజారిటీని అందిద్దాం



పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి సత్యవేడు నియోజకవర్గం నుంచి రికార్డు స్థాయిలో భారీ మెజారిటీని చూపాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన నారాయణవనంలోని సెగుంద ర్‌వీధిలో గ్రాడ్యుయేట్లను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో గట్టిపోటీని ఎదుర్కొన్నప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యర్థులను ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులుగా గెలిపించారన్నారు. స్థానిక సంస్థల కోటాలో ఎదురు లేకుండా పార్టీ బలపరచిన అభ్యర్థులు ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. ఇదే ఉత్సాహంతో పట్టభద్రుల ఎమ్మెల్సీగా శ్యామ్ ప్రసాద్ రెడ్డి గెలుపుతో పాటు భారీ మెజారిటీ అందించే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. జగనన్న పాలనలో ప్రతి గడపకూ సంక్షేమం అందిందని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను అస్త్రాలుగా మార్చుకుని ప్రచారాన్ని చేయాలని సూచించారు. పేర్నాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా చైతన్య పరచాలని కోరారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, వ్యవసాయ సలహా కమిటీ మండల కన్వీనర్ అన్నాదొరై, సచివాల మండల కన్వీనర్ బాబు, వైస్ ఎంపీపీ శివ శంకర్, పార్టీ నాయకులు సాయిరవి, చిన్నదొరై, మనోహర్, మోహన్, మణిరెడ్డి పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని ఆశీర్వదించండి

వరదయ్యపాళెం: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించి, ఘన విజయం చేకూర్చాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం మండలంలోని రాచర్ల, కంచరపాళెం పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రాడ్యుయేట్ల ఇళ్లకు వెళ్లి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ చిన్నా, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, సచివాలయ కన్వీనర్ గిరి, మహేంద్ర, భూషణం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటికి మద్దతుగా ప్రచారం

పిచ్చాటూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కి మద్దతుగా నాగలాపురంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రచారం చేశాయి. గ్రాడ్యుయేట్ల ఇళ్లకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలియార్, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, నాయకులు శ్యామ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, జగదీష్ రెడ్డి, ఎస్‌ఎం సురేష్, విజయ్‌కుమార్, మదన్, దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.



రాచర్లలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నాగలాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

అభినవ పూలే ఎమ్మెల్యే బియ్యపు మధు



కొబ్బరికాయలు కొడుతున్న వన్నెకుల క్షత్రియులు

శ్రీకాళహస్తి: వన్నెకుల క్షత్రియులకు సముచిత స్థానం కల్పించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి అభినవపూలేగా గుర్తింపు తెచ్చుకున్నారని వన్నెకుల క్షత్రియ సంఘం ఉపాధ్యక్షుడు పెరుమాళ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద 501 కొబ్బరికాయలను కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రాంతంలో అత్యధిక జనాభా ఉన్న వన్నెకుల క్షత్రియులను గుర్తించి డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎమ్మెల్సీ చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని తిరిగి అత్యంత మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బుజ్జిరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, మహేష్‌రెడ్డి, మధురెడ్డి, ఎంఎస్‌రెడ్డి, మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, దీపక్‌రెడ్డి, దామోదరరెడ్డి, జీవీకే రెడ్డి, కంఠా ఉదయ్‌కుమార్, చంద్ర, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులతో సమావేశం



నాయకులతో చర్చిస్తున్న ప్రమోద్‌రెడ్డి

కేవీబీపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తనయుడు ప్రమోద్‌రెడ్డి గురువారం మండల నాయకులతో సమావేశమయ్యారు. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన ఆదర్శ పాఠశాల, కేవీబీపు రం, రాగిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, నందకుమార్, శాస్త్రిరాజు, రామ్మోహన్ వర్మ, ఢిల్లీబాబు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ముక్కంటి ఆలయంలో శ్రీశైలం ఈఓ లవన్న



ఆర్‌పీఎఫ్ ఐజీ అమిత్ అగ్నిహోత్రిని సన్మానిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శ్రీశైలం ఈఓ లవన్న, సికింద్రబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే ఆర్‌పీఎఫ్ ఐజీ అమిత్‌అగ్నిహోత్రి వేర్వేరుగా దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు సాధన మున్నా, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు నాగభూషణం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద పెళ్లి కుమార్తెకు ఎమ్మెల్యే నిక్కా కానుక



బీరువా, డబుల్‌కాట్ మంచంఅందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 17వ వార్డులో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ తాసిన్‌కు వివాహం నిశ్చయమైంది. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పెళ్లి కుమార్తె పేదరికాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గురువారం మేనమామ సారెగా బీరువా, డబుల్‌కాట్ మంచం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్ రాయల్, ఫజల్, హరి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పేదలకు రెండో విడత ఇళ్ల పట్టా పంపిణీ కోసం ఏర్పాటు చేయనున్న జగనన్న కాలనీ కోసం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి స్థల పరిశీలన చేశారు. గురువారం తొట్టంబేడు, శివనాథపాళెంలో పంచాయతీల్లో జగనన్న కాలనీకి కేటాయించిన స్థలాలను పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేఎస్ రామారావు, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, డిప్యూటీ సర్వేయర్ గురవయ్య, మండల సర్వేయర్ మోహన్‌కృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: పిల్లలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకాన్ని అమలుచేయాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో రవీంద్రనాథ్ హెచ్చరించారు. ఆయన గురువారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. అదేవిధంగా పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు



ఇంటి పన్ను వసూలు చేస్తున్న పురపాలకసంఘ సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని 15వ వార్డు పరిధిలో గురువారం పురపాలక సంఘ సిబ్బంది ఇంటి పన్ను, కొళాయి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి, కొళాయి పన్నులు సకాలంలో చెల్లించి, పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయసాధన పుస్తకాల పంపిణీ



ఇరుగుళంలో విజయసాధన పుస్తకాలు అందజేస్తున్న శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్రకుమార్

సత్యవేడు: మండలంలోని మాదనపాళెం, ఇరుగుళం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు విజయసాధన పుస్తకాలు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్రకుమార్ మాట్లాడుతూ శ్రీసిటీ పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించాలనే ఉద్దేశంతో విజయ సాధన పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు విద్యార్థులకు ×ఇళ్లు, రోడ్లు, పని ప్రదేశాల్లో ప్రమాదాలు₹ అన్న అంశంపై పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం శ్రీసిటీలో నిర్వహించనున్న జాతీయ భద్రతా ముగింపు వారోత్సవాల్లో బహుమతులు అందజేస్తామని అధికారులు తెలిపారు.

మా భూముల్లో సహజ వాయువు పైపులైన్ వేయొద్దు



అధికారికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, రైతులు

సత్యవేడు: తమ భూముల్లో సహజ వాయువు పైపులైన్ వేయొద్దని ఇరుగుళం రైతులు తెలిపారు. తమిళనాడులోని తిరువళ్లూరు నుంచి శ్రీసిటీకి సహజ వాయువు పైపులైన్ ఏర్పాటుపై గురువారం ఇరుగుళంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధీకృత అధికారిణి పి.భవాని రైతులు, ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఆమె మాట్లాడుతూ సహజవాయువు పైపులైను వేయడం కోసం రైతులు, ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్‌రెడ్డితోపాటు పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఇరుగుళంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ఎంపీపీ పాఠశాలల సమీపంలో పైపులైన్, గ్యాస్ స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల 500 మంది పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. సమీపంలోని శ్రీసిటీ, ప్రభుత్వ స్థలాల్లో పైపులైన్ వేసి ఇరుగుళం ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. అనంతరం రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ జీ.శేఖర్, ఎంపీటీసీ బాలసుందరం రెడ్డి, శ్రీరామచంద్రారెడ్డి, మధుసూదన్ బాబు, బి.మునిచంద్రారెడ్డి, సునీల్, దయాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శంకర్ యాదవ్, శశిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

500 పశువులకు టీకాలు



పాడి ఆవుకు టీకా వేస్తున్న డాక్టర్ శిల్పారెడ్డి

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఏర్పేడు పశువైద్యాధికారి శిల్పారెడ్డి ఆధ్వర్యంలో 500 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఏర్పేడు, అంజిమేడు, నాగంపల్లె, కొత్తవీరాపురం, బండారుపల్లె, చింతలపాళెం, చెల్లూరు తదితర గ్రామాల్లో పశువులు, పాడి గేదెలు, ఆవులకు టీకాలు వేశారు. ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య పాల్గొన్నారు.

మూడు గేదెలు మృతి

వరదయ్యపాళెం: మండలంలోని కువ్వాకొల్లిలో గురువారం మూడు గేదెలు ఉన్నట్టుండి మృతి చెందాయి. గ్రామంలోని సుబ్రమణ్యం, నరసింహులుకు చెందిన మూడు గేదెలు మేతకోసం వెళ్లాయి. ప్రైవేటు పరిశ్రమ ప్రహరీగోడ పక్కనే ఉన్న కాలువ వద్ద మృతి చెందాయి. ప్రహరీగోడపై ఉన్న ఫెన్సింగ్ వైర్ పశువులపై పడడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెంది ఉంటాయని బాధితులు వాపోతున్నారు. దీనిపై విచారణ చేస్తామని పరిశ్రమ యాజమాన్యం తెలిపింది.

వేలం పాటలో రూ.16.19 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, అధికారులు

పిచ్చాటూరు: స్థానిక పంచాయతీకి చెందిన ఆస్తుల వేలంలో రూ.16,18,600 ఆదాయం వచ్చినట్టు ఈఓపీఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రాధిక తెలిపారు. స్థానిక సచివాలయంలో గురువారం సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కాంప్లెక్స్‌లోని 23 గదులకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని 13 గదులకు రూ.10,47,600 సమకూరిందన్నారు. మొదటి ఫ్లోర్‌లో ఉన్న 10 గదుల కోసం ఎవరూ వేలంలో పాల్గొనకపోవడంతో వాయిదా వేశామన్నారు. అలాగే దినసరి కూరగాయల మార్కెట్, జంతువధశాల, బస్టాండ్‌కు రూ.5,71,000 వచ్చిందన్నారు. గత ఏడాది కన్నా ఈ సారి రూ.6.91 లక్షలు అదనంగా వారు పేర్కొన్నారు.

ఫ్యాక్టరీ వ్యర్థాలతో నీరు కలుషితం



కలుషితమైన నీటిని ఎంపీడీవోకు చూపుతున్న సర్పంచ్ స్వప్న, గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులోని కలర్ పాయింట్ అనే ఫ్యాక్టరీ నుంచి వస్తున్న కెమికల్స్ వ్యర్థాలతో తాగునీరు కలుషితమవుతోందని సర్పంచ్ స్వప్న, గ్రామస్తులు వాపోయారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు గురువారం గ్రామానికి చేరుకుని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కలర్ పాయింట్ అనే కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యం రసాయనిక వ్యర్థాలను పక్కనే ఉన్న చీటి కాలువతోపాటు చెరువులోకి వదులుతున్నారని తెలిపారు. ఆ నీటిని వినియోగిస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. అలాగే పశువులు రోగాల బారిన పడుతున్నాయని, చెరువులోని చేపలు మృతిచెందుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ నీటి శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపించి, రిపోర్టు రాగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెల్లేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



పనులను పర్యవేక్షిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన చెల్లేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని పానగల్‌లో ఉన్న ఈ ఆలయ అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో పురాణ చారిత్రక ప్రసిద్ధమైన ఈ ఆలయం మరుగున పడిన విషయాన్ని గుర్తించామన్నారు. అభివృద్ధి కోసం రూ.12లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రహరీ, అంతర్గతంగా గ్రానైట్ రాళ్ల పరచడం, తిరుపతి-శ్రీకాళహస్తి రోడ్డు నుంచి ఆలయం వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శోభారాణి, కాంట్రాక్టర్ తేజు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో పొలానికి రక్షణ



ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ట్రైనర్లు, తదితరులు

నారాయణవనం: నవధాన్యాల సాగుతో భూసారం పెరగడంతోపాటు మిత్ర పురుగులకు రక్షణ కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా అధికారి మునిరత్నం తెలిపారు. రైతు సాధికార సంస్థ, రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం తిరుపతి ప్రాజెక్ట్ సంయుక్తంగా అరణ్యంకండ్రిగ పంచాయతీలో రైతులు, ప్రకృతి వ్యవసాయ ఇన్‌స్ట్రక్టర్లకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంతో భూమి నిస్సారమవుతుందని తెలిపారు. భూమి సారవంతమైతేనే ఆరోగ్యవంతమైన పంట దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతమై అధిక దిగుబడి వస్తుందని వివరించారు. అనంతరం నవధాన్యాలతో పచ్చరొట్టె తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ప్రకృతి వ్యవసాయం ట్రైనర్లు, క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామంలో ర్యాలీ చేశారు. డీపీఎం భానుమూర్తి, ట్రైనర్లు నీలమ్మ, సుధాకర్, ఆర్బీకే ఇన్‌చార్జి మోహన్‌రాజు, క్షేత్రస్థాయి సిబ్బంది సురేష్, నిరోషా, సుహాసిని, వెంకటేష్, భూపతి, శివయ్య పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని కందాడలో రోడ్డు మరమ్మతు పనులకు గురువారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు భాస్కర్, రాంబత్తి యాదవ్, పరందామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఏర్పేడు: రావిళ్లవారికండ్రిగ పొలాల్లో బోరు, విద్యుత్ మోటారు ధ్వంసంపై ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి గురువారం తెలిపారు. రావిళ్లవారికండ్రిగకు చెందిన అశోక్ తాను కొనుగోలు చేసిన పొలంలోని బోరు, విద్యుత్ మోటారుతో పంటలు సాగు చేస్తున్నాడు. వడమాలపేట మండలం టీసీ అగ్రహారానికి చెందిన దాము బోరు, మోటారు తనదంటూ ధ్వంసం చేశారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. దాము పొలానికి వెళ్లి బోరు, మోటారు ధ్వంసం చేసిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు దాముపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు



ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని గుండేలుగుంట జెడ్పీ హైస్కూల్ సమీపంలో రోడ్డుపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో అవి కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్లకు ఇరువైపులా జీబ్రా లైన్లు లేకపోవడంతో వాహనచోదకులు వేగంగా వచ్చి అదుపు తప్పి పడుతున్నారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లకు జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.